క్లుప్తంగా

బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడికి సన్మానం



రాంచందర్‌రావును సన్మానిస్తున్న అరిగెల

ఆసిఫాబాద్‌అర్బన్: బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడిగా నూతనంగా ఎన్నికైన రాంచందర్‌రావును గురువారం హైదరాబాద్‌లోని తన నివాసంలో జిల్లా వన్ నేషన్ వన్ ఎలక్షన్ కన్వీనర్, బీజేపీ సీనియర్ నాయకుడు అరిగెల నాగేశ్వర్‌రావు మర్యాదపూర్వకంగా కలిశారు. పుష్పగుచ్ఛాన్ని అందించి శాలువాతో సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా రాంచందర్‌రావు మాట్లాడుతూ త్వరలో ఆసిఫాబాద్ జిల్లాలో పర్యటిస్తానని, పార్టీ బలోపేతానికి ప్రతి ఒక్కరూ కలిసికట్టుగా పనిచేయాలని సూచించారు. పార్టీ జిల్లా నాయకులు ఉన్నారు.

ఓటరు నమోదును విధిగా చేపట్టాలి



బీఎల్‌వోలతో ఆర్డీవో లోకేశ్వర్ రావు

రెబ్బెన: బీఎల్‌వోలు నూతన ఓటరు నమోదు ప్రక్రియను విధిగా చేపట్టాలని ఆర్డీవో లోకేశ్వర్ రావు అన్నారు. మండలంలోని కేకే గార్డెన్స్‌లో గురువారం బీఎల్‌వోల శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. ముఖ్య అతిథిగా ఆయన హాజరై మాట్లాడారు. ప్రతి బీఎల్‌వో తమ పరిధిలోని బూత్ స్థాయిలో 18 ఏళ్లు నిండిన యువతీ, యువకులు ఓటు హక్కు నమోదు చేసుకునేలా చూడాలన్నారు. ప్రతి ఒక్కరికి ఓటు హక్కు ప్రాముఖ్యత వివరిస్తూ ఓటరు నమోదు ప్రక్రియను పకడ్బందీగా చేపట్టాలని సూచించారు. ఈ సందర్భంగా బీఎల్‌వోల విధివిధానాలను వివరించారు. తహసీల్దార్ సూర్యప్రకాశ్, నాయబ్ తహసీల్దార్ లలిత, ఆర్‌ఐ సౌమ్య, మాస్టర్ ట్రైనర్ సాయితేజ, రెవెన్యూ సిబ్బంది ప్రేంకిరణ్ తదితరులు పాల్గొన్నారు.

'నేడు సెక్రటేరియట్ ముట్టడి'

రెబ్బెన: రాష్ట్ర ప్రభుత్వం జాబ్ క్యాలెండర్ విడుదల చేసి నోటిఫికేషన్లు ఇవ్వాలని డిమాండ్ చేస్తూ డీవైఎఫ్‌ఐ రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు శుక్రవారం చలో సెక్రటేరియట్ ముట్టడి చేపట్టినట్లు డీవైఎఫ్‌ఐ జిల్లా ఉపాధ్యక్షుడు చాపిడి పురుషోత్తం తెలిపారు. మండలకేంద్రంలో గురువారం మాట్లాడారు. అన్ని ప్రభుత్వ శాఖల్లో ఖాళీలను భర్తీ చేయాలన్నారు. చలో సెక్రటేరియట్ ముట్టడి కార్యక్రమానికి నిరుద్యోగులు అధిక సంఖ్యలో హాజరుకావాలని పిలుపునిచ్చారు. సమావేశంలో జిల్లా ఉపాధ్యక్షురాలు శ్రావణి, నాయకులు తిరుపతి పాల్గొన్నారు.

ఆయిల్‌పాం ప్లాంటేషన్ పరిశీలన

కాగజ్‌నగర్‌రూరల్: మండలంలోని కొత్త సార్సాల గ్రామ శివారులోని ఆయిల్‌పాం ప్లాంటేషన్‌ను గురువారం హార్టికల్చర్ అధికారి సుప్రజ పరిశీలించారు. ఆయిల్‌పాం ప్లాంటేషన్‌తో అధిక ఆదాయం పొందవచ్చని పేర్కొన్నారు. సీఈవో ఉదయ్‌కుమార్ ఉన్నారు.

సీఎంఆర్ఎఫ్ చెక్కుల పంపిణీ

కాగజ్‌నగర్‌టౌన్: పట్టణంలోని సుభాష్ కాలనీకి చెందిన నాగలక్ష్మికి మంజూరైన సీఎంఆర్ఎఫ్ చెక్కును ఎమ్మెల్యే పాల్వాయి హరీశ్‌బాబు తన నివాసంలో గురువారం అందజేశారు. పట్టణ అధ్యక్షుడు శివకుమార్ ఉన్నారు.

చింతలమానెపల్లి: డబ్బాకు చెందిన గుర్లె ఉజ్వలకు రూ.60 వేలు, అడెపెల్లికి చెందిన బద్ది గంగారామ్‌కు రూ.25,500, సుంకె తిరుపతికి రూ.6వేలు సీఎం సహాయ నిధి నుంచి ఆర్థికసాయం మంజూరైంది. బీజేపీ జిల్లా అధ్యక్షుడు దోని శ్రీశైలం ఈ మేరకు చెక్కులు పంపిణీ చేశారు. పార్టీ జిల్లా కార్యదర్శి బండి రాజేందర్‌గౌడ్, నాయకులు పాల్గొన్నారు.

చికెన్ సెంటర్ సీజ్

సిర్పూర్(టి): మండల కేంద్రంలోని బస్టాండ్ ప్రాంతంలో ఎలాంటి అనుమతి లేకుండా నిర్వహిస్తున్న చికెన్ సెంటర్‌ను పంచాయతీ అధికారులు గురువారం సీజ్ చేశారు. స్థానికుల ఫిర్యాదు మేరకు ఈ చర్యలు తీసుకున్నారు. పంచాయతీ ఈవో తిరుపతి, సిబ్బంది ఉన్నారు.

సబ్సిడీపై విత్తనాలు పంపిణీ

కాగజ్‌నగర్‌రూరల్: మండలంలోని చారిగాంలో వందశాతం సబ్సిడీపై కంది, జొన్న విత్తనాలను వ్యవసాయాధికారి రామకృష్ణ గురువారం పంపిణీ చేశారు. జాతీయ ఆహారభద్రత పథకం ద్వారా రైతులకు కంది, జొన్న విత్తనాలు అందించినట్లు తెలిపారు. ఏఈవో శ్రీనివాస్, రైతులు పాల్గొన్నారు.

ఆర్థికసాయం

పెంచికల్‌పేట్: గొంట్లపేట్ గ్రామానికి చెందిన గంగయ్య గురువారం అనారోగ్యంతో మృతి చెందాడు. ఎమ్మెల్సీ దండె విఠల్ ఆదేశాల మేరకు మాజీ సర్పంచ్ దాసరి చంద్రమౌళి.. బాధిత కుటుంబాన్ని పరామర్శించి రూ.5 వేలు ఆర్థికసాయం అందించారు.

చిత్తడిగా రోడ్లు



దహెగాం లగ్గాం వెళ్లే దారి..



మార్కెట్ ఏరియాలో..

దహెగాం: వర్షాకాలం వచ్చిందంటే చిన్నపాటి వర్షాలకే రోడ్లు చిత్తడిగా మారుతున్నాయి. మండల కేంద్రం నుంచి లగ్గాం వెళ్లే రోడ్డుపై గుంతలు ఏర్పడడంతో ప్రజలు ఇబ్బంది పడుతున్నారు. తహసీల్దార్ కార్యాలయానికి వెళ్లేదారి బురదగా మారింది. నిత్యం పదుల సంఖ్యలో ప్రజలు కార్యాలయానికి వెళ్తుంటారు. నడవడానికి ఇబ్బంది పడుతున్నారు. మార్కెట్ ఏరియాలో చిత్తడిగా మారడంతోపాటు దోమలు స్వైర విహారం చేస్తున్నాయని పలువురు వాపోతున్నారు. నీటి నిల్వ చోట బ్లీచింగ్ పౌడర్ చల్లడం లేదని స్థానికులు పేర్కొంటున్నారు.

దారి ఇలా.. నడిచేదెలా



కెరమెరి: మండలంలోని మాలేపూర్ నుంచి ఉమ్రి వరకు రోడ్డు అధ్వానంగా మారింది. వర్షానికి బురదమయం కావడంతో ప్రజలు, ప్రయాణికులు తీవ్ర ఇబ్బంది పడుతున్నారు. పాదచారులతోపాటు ఏ వాహనాలు వెళ్లలేదని పరిస్థితి. అధికారులు స్పందించి రోడ్డుకు మరమ్మతు చేయించాలని గ్రామాల ప్రజలు కోరుతున్నారు.

'ఇందిరమ్మ' ఇళ్లకు బ్రేక్



పాశిగాంలో బేస్‌మెంట్ లెవల్ పూర్తయిన ఇందిరమ్మ ఇల్లు

- ఆషాఢమాసంలో నిర్మాణం చేపట్టేందుకు అనాసక్తి
- ముందుకురాని లబ్ధిదారులు
- ఆశించిన స్థాయిలో కనిపించని పురోగతి

రెబ్బెన: రాష్ట్రంలో నిరుపేదలకు ఇందిరమ్మ ఇళ్లు ప్రభుత్వం మంజూరు చేస్తోంది. ఇందులో భాగంగా నియోజకవర్గానికి ఇప్పటికే 3500 చొప్పున ఇళ్లు మంజూరు చేయగా, పైలట్ ప్రాజెక్టు కింద ప్రతీ మండలానికి ఒక గ్రామానికి ఎంపిక చేసింది. ప్రభుత్వం అర్హులకు మంజూరు చేసిన ఇళ్ల నిర్మాణాలు చేపట్టి త్వరితగతిన పూర్తి చేయాలని అధికారులు పేర్కొంటున్నారు. ఆషాఢమాసం కావడంతో వీటి నిర్మాణ పనులు చేపట్టేందుకు లబ్ధిదారులు ఆసక్తి చూపడం లేదు. పనులు మొదలుపెట్టేందుకు ముందుకు రావడం లేదు. దీంతో ఆశించిన స్థాయిలో ఇళ్ల నిర్మాణాల్లో పురోగతి కనిపించడం లేదు.

శుభ ముహూర్తాల ప్రారంభంతో ..

ఈనెలాఖరు తర్వాత శుభ ముహూర్తాల ప్రారంభంతో ఇంటి నిర్మాణ పనులు మొదలుపెట్టాలని లబ్ధిదారులు భావిస్తున్నారు. ముందుగా పనులు చేపట్టాలని ప్రభుత్వం ఒత్తిడి చేస్తుండడం, లబ్ధిదారుల నుంచి సహకారం అందకపోవడంతో అధికారులు తలలు పట్టుకుంటున్నారు. లబ్ధిదారుల్లో చాలామంది ప్రస్తుతం ఉన్న ఇంటిని తొలగించి కొత్త నిర్మాణాలు చేపట్టాలని చూస్తున్నారు. ఉన్న ఇంటిని తొలగిస్తే ఇళ్లు కిరాయికి దొరకడం కష్టంగా మారుతుంది. దానికి తోడు వర్షాకాలం కావడం, కొత్త ఇంటి నిర్మాణం చేపడితే పూర్తయ్యేందుకు సమయం పడుతుంది. ఈ కారణాల వల్ల గ్రామాల్లో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలు పుంజుకోవడం లేదు. అయినప్పటికి అధికారులు లబ్ధిదారులతో మాట్లాడుతూ నిర్మాణాలు చేపట్టేలా అవగాహన కల్పిస్తున్నారు.

233 ఇళ్లు మంజూరు

రెబ్బెన మండలంలోని 24 పంచాయతీల్లో పాశిగాం పంచాయతీని పైలట్ గ్రామంగా ఎంపిక చేశారు. తొలివిడతలో 71 ఇళ్లు, మిగిలిన 23 జీపీలకు 162 ఇళ్లు మొత్తం 233 మంజూరయ్యాయి. పాశిగాంలో 71 గాను 62 ఇళ్ల నిర్మాణాలను అధికారులు ప్రారంభించారు. ఇప్పటివరకు బేస్‌మెంట్ లెవల్ 44, రూఫ్‌లెవల్ వరకు 9 పూర్తి కాగా స్లాబ్‌లు 2 ఇళ్లు పూర్తయ్యాయి. ఇక బేస్‌మెంట్ ప్రారంభం కాని ఇళ్లు 18 ఉండగా, ఇంకా ఇంటి నిర్మాణ పనులే ప్రారంభం కానివి 9 ఉన్నాయి. మిగిలిన 23 పంచాయతీల్లో మంజూరైన ఇళ్లలో 123 ఇంటి నిర్మాణాలకు అధికారులు మార్క్ అవుట్ ఇవ్వగా వాటిలో బేస్‌మెంట్ లెవల్‌లో 44, రూఫ్‌లెవల్‌లో 7, స్లాబ్ లెవల్‌లో ఒకటి మాత్రమే ఉంది.

చైతన్యపరుస్తున్నాం

ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలు చేపట్టేలా లబ్ధిదారులను చైతన్యపరుస్తున్నాం. ఆషాఢ మాసమని పనులు ప్రారంభించేందుకు కొందరు ఇష్టపడటం లేదు. అయినప్పటికి వారికి అవగాహన కల్పించి నిర్మాణాలు ప్రారంభించేలా చేస్తున్నాం.

– సదాశివ్, ఏఈ, హౌసింగ్

మొక్కల పంపిణీ షురూ..



లొద్దిగూడ గ్రామంలో గుంతలు తవ్వుతున్న ఉపాధి కూలీలు

- మండలంలో ముమ్మరంగా గుంతల తవ్వకం
- కొనసాగుతున్న మొక్కలు నాటే కార్యక్రమం

లింగాపూర్: గ్రామాల్లో పచ్చదనం పెంపొందించేందుకు ప్రభుత్వం ఏటా మొక్కలు నాటే కార్యక్రమం చేపడుతోంది. కాంగ్రెస్ ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా వన మహోత్సవ కార్యక్రమాన్ని నిర్వహిస్తోంది. ఇందులో భాగంగా మండలానికి 1.69 లక్షల మొక్కలు నాటాలని లక్ష్యాన్ని నిర్దేశించింది. ఇందుకుగాను 14 గ్రామ పంచాయతీల నర్సరీల్లో మొక్కల పెంపకం చేపట్టింది. ప్రతీ నర్సరీలో 10 వేల నుంచి 12 వేల చొప్పున సుమారు 10 రకాల వివిధ రకాల మొక్కలు పెంచింది. జామపండు, ఉసిరి, అల్లనేరేడు, చింతచెట్టు, సీతాఫలం, దానిమ్మ, గులాబీ, మల్లెపూలు, మందారం, కానుగ, గుల్మోహర్, మునగ తోపాటు తదితర రకాల మొక్కలు ఉన్నాయి. ఆ మొక్కలు పంపిణీకి సిద్ధంగా ఉన్నాయి. వన సంరక్షకుల ఆధ్వర్యంలో మొక్కల సంరక్షణ చర్యలు చేపట్టారు. ఉపాధి హామీ ఆధ్వర్యంలో పర్యవేక్షించారు. మొక్కలు నాటేందుకు గ్రామాల్లో ఉపాధికూలీలతో గుంతల తవ్వకం చేపట్టారు. స్థలాలను గుర్తించి ఈ మొక్కలు నాటే కార్యక్రమం కొనసాగుతోంది. ప్రభుత్వ స్థలాలు, రోడ్లకు ఇరువైపులా, పాఠశాలల్లో మొక్కలు నాటుతున్నారు. నాటిన ప్రతీ మొక్కను సంరక్షించేందుకు గ్రామస్తుల సహకారం ఉండేలా అధికారులు అవగాహన కల్పిస్తున్నారు.

విరివిగా నాటుతాం



నర్సరీల్లో పెంచిన మొక్కల పంపిణీకి సిద్ధం ఉంచాం. గ్రామాల్లో విరివిగా మొక్కలు నాటుతాం. మొక్కల సంరక్షణలో గ్రామస్తుల సహకారం ఉండాలి.

– రామచందర్, ఎంపీడీవో, లింగాపూర్

అక్రమాలకు పాల్పడితే చర్యలు తప్పవు

- ఏడీఏ మనోహర్



తనిఖీ చేస్తున్న ఏడీఏ మనోహర్

చింతలమానెపల్లి: ఫర్టిలైజర్, ఎరువులు, విత్తనాల డీలర్లు అక్రమాలకు పాల్పడితే చర్యలు తప్పవని ఏడీఏ మనోహర్ హెచ్చరించారు. మండలంలోని డబ్బా, గూడెం, గంగాపూర్, రవీంద్రనగర్ గ్రామాల్లోని ఫర్టిలైజర్, ఎరువుల దుకాణాల్లో గురువారం తనిఖీలు నిర్వహించారు. గ్రామాల్లో ఏవో కార్తీషా, ఏఈవోలు క్లస్టర్ల వారీగా తనిఖీలు చేశారు. సంబంధిత నిల్వలు, రికార్డులు, రోజు పుస్తకాలను పరిశీలించారు. ఎరువులు అక్రమంగా తరలించినా అధిక ధరలకు విక్రయించినా చర్యలు తప్పవన్నారు.

డీలర్లు నిబంధనలు పాటించాలి

కౌటాల: ఎరువుల దుకాణాల డీలర్లు నిబంధనలు పాటించాలని ఏవో పి.ప్రేమలత అన్నారు. మండల కేంద్రంలోని పలు ఎరువుల దుకాణాల్లో గురువారం వ్యవసాయాధికారులు తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎరువుల, మందుల, విత్తనాల స్టాక్, రికార్డులను పరిశీలించారు. ఏఈవోలు అంజన్న, ఘనశ్యాం, కల్పన, డీలర్లు ఉన్నారు.

యువకుల శ్రమదానం



గుంతలు పూడుస్తున్న పోతెపల్లి యువకులు

పెంచికల్‌పేట్: మండలంలోని గొంట్లపేట్ నుంచి పోతెపల్లి వరకు ప్రధాన రహదారి గుంతలమయంగా మారింది. గ్రామానికి చెందిన యువకులు గురువారం శ్రమదానం చేసి మొరంతో గుంతలు పూడ్చారు. కార్యక్రమంలో యువకులు పాల్గొన్నారు.

ఆషాఢమాస బోనాలు



బోనాలతో ఊరేగింపులో భక్తులు

తిర్యాణి: ఆషాఢమాసం సందర్భంగా మండల కేంద్రంలో గురువారం మహిళలు బోనాలు ఎత్తుకుని ఊరేగింపు నిర్వహించారు. అనంతరం ఎల్లమ్మ గుడిలో అమ్మవారికి బోనాలు సమర్పించారు. ప్రజలు సుభిక్షంగా ఉండటంతోపాటు పాడి పంటలు అధికంగా పండాలని మొక్కుకున్నారు. ఏటా ఆషాఢమాసంలో అమ్మవారికి బోనాలు సమర్పించడం అనవాయితీగా వస్తోందని పలువురు భక్తులు పేర్కొన్నారు. సమ్మక్క ఆలయ పూజార్లు బొమ్మగొని సత్యగౌడ్, కరిగంటి బాపు తదితరులు ఉన్నారు.

నేడు వారాహిదేవి పూజ

ఆసిఫాబాద్: జిల్లాకేంద్రంలోని వాసవీ కన్యకాపరమేశ్వరి ఆలయంలో శుక్రవారం ఉదయం 10 గంటలకు శ్రీ లక్ష్మీవారాహి దేవిపూజ, కుంకుమార్చన కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు ఆలయ కమిటీ అధ్యక్షుడు రావుల శంకర్ ఓ ప్రకటనలో తెలిపారు. వారాహి నవరాత్రోత్సవ సందర్భంగా నిర్వహించే కార్యక్రమానికి భక్తులు పాల్గొనాలని కోరారు.

ఎరువుల కొరత లేకుండా చూడాలి

కౌటాల: రైతులకు ఎరువుల కొరత లేకుండా చూడాలని బీజేపీ జిల్లా అధ్యక్షుడు ధోని శ్రీశైలం అన్నారు. కౌటాల ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం గోదాంను గురువారం ఆయన పరిశీలించారు. వానాకాలం పంటల సాగు సమయంలో యూరియా కొరతతో రైతులు ఇబ్బందులు పడుతున్నారన్నారు. ప్రభుత్వానికి ముందస్తు ప్రణాళిక లేని కారణంగా యూరియా కొరత ఉందని ఆరోపించారు. జిల్లా కార్యదర్శి రాజేందర్‌గౌడ్, మండల అధ్యక్షుడు విజయ్, నాయకులు రవి, నాందేవ్ ఉన్నారు.

సంక్షిప్త వార్తలు

ఇందిరమ్మ ఇళ్ల పునపరిశీలన

సిర్పూర్(టి): మండలంలోని అచ్చెల్లి, లక్ష్మీపూర్ గ్రామపంచాయతీల్లో నూతనంగా మంజూరైన ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారుల ఎంపిక జాబితాను ఎంపీడీవో సత్యనారాయణ గురువారం పునపరిశీలన చేశారు. ప్రభుత్వ పథకాలకు అర్హులైన లబ్ధిదారులను ఎంపిక చేస్తామన్నారు. పంచాయతీ కార్యదర్శులు మౌనిక, శ్రీనివాస్ ఉన్నారు.

చెడు అలవాట్లకు దూరంగా ఉండాలి

ఆసిఫాబాద్‌రూరల్: విద్యార్థులు చెడు అలవాట్లకు దూరంగా ఉండాలని సీఐ రవీందర్ అన్నారు. జిల్లా కేంద్రంలోని బాలుర ఉన్నత పాఠశాలలో మాదక ద్రవ్యాల నిర్మూలనలో భాగంగా విద్యార్థులకు గురువారం అవగాహన కల్పించారు. క్రమశిక్షణతో చదివి మంచి ప్రయోజకులు కావాలన్నారు. ఎస్సై ప్రశాంత్, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

పెంచికల్‌పేట్: మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని ఎస్సై కొమురయ్య అన్నారు. పోతెపల్లి గ్రామంలో మత్తపదార్థాల వినియోగం వల్ల కలిగే అనర్థాల గురించి గ్రామస్తులకు గురువారం అవగాహన కల్పించారు. ఆయన వెంట పోలీసు సిబ్బంది ఉన్నారు.

పెండింగ్ డీఏలు విడుదల చేయాలి

కాగజ్‌నగర్‌టౌన్: రాష్ట్ర ప్రభుత్వం ఉద్యోగులు, పింఛన్‌దారులకు పెండింగ్‌లో ఉన్న 6 డీఏలను వెంటనే విడుదల చేయాలని సీనియర్ సిటిజన్స్ రాష్ట్ర కార్యదర్శి మార్త సత్యనారాయణ ఓ ప్రకటనలో డిమాండ్ చేశారు. మార్కెట్ రేట్లకు అనుగుణంగా డీఏలను పెంచి విడుదల చేయాలని కోరారు.

కాంగ్రెస్ సభకు తరలిరావాలి


ఆసిఫాబాద్: హైదరాబాద్‌లోని ఎల్బీ స్టేడియంలో శుక్రవారం నిర్వహించే కాంగ్రెస్ సభకు జిల్లాలోని పార్టీ శ్రేణులు అధిక సంఖ్యలో తరలిరావాలని నియోజకవర్గ ఇన్‌చార్జి అజ్మీర శ్యాంనాయక్ ఓ ప్రకటనలో కోరారు. గ్రామస్థాయి పార్టీ శ్రేణులతో మమేకం కావాలనే ఉద్దేశంతో పార్టీ ఈ సభను నిర్వహిస్తోందని తెలిపారు.

నేడు విద్యుత్ అంతరాయం

కౌటాల: కౌటాల విద్యుత్ సబ్ స్టేషన్‌లో మరమ్మతు కారణంగా శుక్రవారం విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని ఏడీ రాజేశ్వర్ ఓ ప్రకటనలో తెలిపారు. ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు కౌటాల, చింతలమానెపల్లి, బెజ్జూర్ మండలాల్లోని గ్రామాలకు సరఫరా ఉండదని పేర్కొన్నారు.

గోరింటాకు సందడి

ఆసిఫాబాద్: ఆషాడమాసం పురస్కరించుకొని జిల్లా కేంద్రంలోని బ్రాహ్మణవాడ కాలనీలో గురువారం గోరింటాకు సందడి నెలకొంది. మహిళలు గోరింటాకు పెట్టుకున్నారు. ఏటా తమ కాలనీలో ఆషాడమాసం సందర్భంగా గోరింటాకు కార్యక్రమం చేపడుతామని వారు పేర్కొన్నారు. పద్మ, లావణ్య, సంపూర్ణ, సుమిత్ర, మహిళలు పాల్గొన్నారు.



గోరింటాకు పెట్టుకున్న మహిళలు

విద్యార్థుల్లో సృజనాత్మకత పెంపొందించాలి

ఆసిఫాబాద్‌రూరల్: విద్యార్థుల్లో సృజనాత్మకతను పెంపొందించాలని జిల్లా సైన్స్ అధికారి మధుకర్ పేర్కొన్నారు. జిల్లా కేంద్రంలోని బాలికల ఉన్నత పాఠశాలలో సైన్స్ ఉపాధ్యాయులు ఇన్‌స్పైర్ నామినేషన్లపై గురువారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతీ పాఠశాల నుంచి ఇన్‌స్పైర్ నామినేషన్లు పూర్తి చేయాలన్నారు. ప్రతి పాఠశాల నుంచి ఐడియా కాంపిటీషన్ నిర్వహించి ఐదు ఎంపిక చేయాలన్నారు. ఐదుగురు విద్యార్థుల బ్యాంక్ ఖాతాలను ఓపెన్ చేయించి వారి వివరాలను ఇన్‌స్పైర్ మానక్ కింద యాప్‌లో అప్‌లోడ్ చేయాలన్నారు. పరీక్ష నిర్వహణ అధికారి ఉదయ్ బాబు, రిసోర్స్ పర్సన్ తిరుపతయ్య, దేవాజీ, ఎంఈవో సుభాష్ తదితరులు పాల్గొన్నారు.

దేశవ్యాప్త సమ్మె జయప్రదం చేయాలి



మాట్లాడుతున్న జేఏసీ నాయకులు

ఆసిఫాబాద్‌అర్బన్: కేంద్రప్రభుత్వం అవలంబిస్తున్న కార్మిక, కర్షక వ్యతిరేక విధానాలు నిరసిస్తూ ఈనెల 9న తలపెట్టిన దేశవ్యాప్త సమ్మెను జయప్రదం చేయాలని ఏఐటీయూసి జిల్లా ప్రధాన కార్యదర్శి ఉపేందర్, సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు రాజేందర్ పిలుపునిచ్చారు. జిల్లా కేంద్రంలో జేఏసీ ఆధ్వర్యంలో గురువారం ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడారు. కేంద్ర ప్రభుత్వం తీసుకువస్తున్న 4 లేబర్ కోడ్‌లను రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ దేశవ్యాప్త సమ్మె నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ సమ్మెలో కార్మికులు అధిక సంఖ్యలో పాల్గొనాలని కోరారు. సమావేశంలో నాయకులు పిడుగు శంకర్, సత్తయ్య, సమ్మయ్య తదితరులు పాల్గొన్నారు.

ఆసిఫాబాద్‌రూరల్: మధ్యాహ్న భోజన పథకం ప్రైవేటీకరణను వ్యతిరేకిస్తూ ఈనెల 9న జరిగే దేశవ్యాప్త సమ్మెను జయప్రదం చేయాలని సీఐటీయూ జిల్లా నాయకుడు క్రిష్ణమాచారి కోరారు. గురువారం జిల్లా కేంద్రంలోని ఎంఈవో సుభాష్‌కు సమ్మె నోటీసు అందించారు. మధ్యాహ్న భోజన కార్మికులు కమల, సత్తుబాయి, శ్యామల, తిరుపతి తదితరులు పాల్గొన్నారు.

పెండింగ్ వేతనాలు విడుదల చేయాలి

ఆసిఫాబాద్‌అర్బన్: ఆసిఫాబాద్ మున్సిపాలిటీలో పనిచేస్తున్న కార్మికుల పెండింగ్ వేతనాలు వెంటనే విడుదల చేయాలని ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి ఉపేందర్, జిల్లా ఉపాధ్యక్షుడు చిరంజీవి డిమాండ్ చేశారు. జిల్లా కేంద్రంలో మున్సిపల్ కమిషనర్ గజానంద్‌ను గురువారం కలిసి సమస్యలు విన్నవించారు. రాష్ట్రంలోని మున్సిపాలిటీల్లో కార్మికులకు మూడు నుంచి ఐదు నెలల వేతనాలు పెండింగ్‌లో ఉన్నాయని తెలిపారు. మున్సిపల్ కాంట్రాక్టు కార్మికులను పర్మినెంట్ చేసేంత వరకు రూ.26వేల వేతనం చెల్లించాలన్నారు. అనంతరం ఈ నెల 9న జరిగే దేశవ్యాప్త సమ్మెకు సంబంధించిన సమ్మె నోటీసును మున్సిపల్ కమిషనర్‌కు అందించారు.

15లోపు మొక్కల పంపిణీ పూర్తిచేయాలి

కెరమెరి: వన మహోత్సవంలో భాగంగా ఈనెల 15 లోపు మండలంలోని అన్ని పంచాయతీ నర్సరీల్లోని మొక్కలు పంపిణీ పూర్తి చేయాలని మండల ప్రత్యేకాధికారి, ఏడీఏ వెంకట్ అన్నారు. ఎంపీడీవో కార్యాలయంలో ఉపాధి సిబ్బంది, పంచాయతీ కార్యదర్శులకు గురువారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. మొక్కల లక్ష్యాన్ని పూర్తి చేయాలన్నారు. ఈనెల 8న మండల వ్యాప్తంగా ఒకే రోజు ప్లాంటింగ్ చేయాలని నిర్ణయించామన్నారు. పీఎం జన్‌మన్, ఇందిరమ్మ ఇళ్లు రెండో విడత మార్కింగ్, గ్రౌండింగ్ ప్రగతిని పూర్తి చేయాలన్నారు. అన్ని గ్రామాల్లో శానిటేషన్ చేయాలన్నారు. కార్యక్రమంలో ఎంపీడీవో అంజద్‌పాషా, ఏపీఎం జగదీశ్వర్, ఈజీఎస్ ఏపీవో మల్లయ్య ఈసీ అక్యానాయక్ పాల్గొన్నారు.

ప్రతిఒక్కరూ మొక్కలు నాటాలి

పెంచికల్‌పేట్: వన మహోత్సవంలో భాగంగా ఎల్కపల్లి గ్రామంలో ఎంపీడీవో అల్బర్ట్, ఎంఈవో రమేశ్‌బాబుతో కలిసి గురువారం మొక్కలను నాటారు. పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరూ మొక్కలు నాటాలన్నారు. ఏపీవో సతీశ్, పంచాయతీ కార్యదర్శి చంద్రశేఖర్ పాల్గొన్నారు.

మొక్కల పంపిణీ

కౌటాల: మండలంలోని వీర్దండి గ్రామంలో గ్రామస్తులకు మాజీ సర్పంచ్ మడావి రేణుక గురువారం మొక్కలు పంపిణీ చేశారు.